ప్రజాశక్తి
ఆదివారం 5 ఫిబ్రవరి 2023
5
శ్రీకాకుళం

ఎస్‌పి మానవత్వం

శ్రీకాకుళం ప్రతినిధి : శ్రీకాకుళం నగరంలోని దామోదరం సంజీవయ్య పార్కు సమీపంలో ఫుట్‌పార్కుపై నిస్సహాయంగా పడి ఉన్న సాకిపల్లి రామారావు అనే కుష్టు వ్యాధిగ్రస్తునిపై ఎస్‌పి జి.ఆర్ రాధిక మానవత్వం చూపారు. విధుల్లో భాగంగా శనివారం అటువైపు వెళ్లిన ఆమె కుష్టు వ్యాధితో ఇబ్బంది పడుతూ అనాథగా ఉన్న రామారావు వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరానికి చెందిన ఆయన్ను కుటుంబ సభ్యులు దూరంగా ఉంచడంతో అనాథగా మారారన్న విషయం తెలుసుకున్న ఆమె మెరుగైన చికిత్స ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించాలని సూచించారు. మెరుగైన చికిత్స కోసం ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు అతని వ్యాధిని పరిశీలించి మెరుగైన చికిత్స కోసం విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ విషయాన్ని రామారావు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

ఉత్తరాంధ్రకు బిజెపి ద్రోహం

- వెనుకబడిన ప్రాంత నిధులను వెనక్కి తీసుకున్నారు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- విశాఖ ఉక్కును అమ్మడానికి ఎంత ధైర్యం : చలసాని
- ఇచ్ఛాపురంలో ముగిసిన సమరయాత్ర

శ్రీకాకుళం సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, ఇచ్ఛాపురం

వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంలో పేర్కొన్నా, బిజెపి ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ప్రత్యేక హోదా సాధన సమితి, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన హిందూపురం నుంచి చేపట్టిన సమరయాత్ర (బస్సు యాత్ర) ఇచ్ఛాపురంలో శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరం, కాశీబుగ్గ, ఇచ్ఛాపురంలో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అడిగితే ఇచ్చిన నిధులను సైతం కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. బడ్జెట్‌లో ఈ ప్రాంతానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదని విమర్శించారు. ఒక్కొక్క జిల్లాకు రూ.10 వేల కోట్లు చొప్పున ఇవ్వాలని, లేకుంటే ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. సుజల స్రవంతి ద్వారా శ్రీకాకుళానికి నీళ్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, అరకొర నిధులు కేటాయిస్తే ఎప్పుడు పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇస్తే పరిశ్రమలు వచ్చి కొంతమందికైనా ఉపాధి కలుగుతుందని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం అమ్మేయడానికి సిద్ధమవుతోందని, కొనడానికి రాకపోతే మూసివేస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. దేశాన్ని ముంచేసి ప్రజల ఆస్తులను కొల్లగొట్టిన అదానీకి విశాఖ ఉక్కును అప్పగిస్తామని చెప్పడానికి బిజెపికి సిగ్గుండాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు ప్రత్యేక హోదా సాధన కోసం పోరాటం కొనసాగించాల్సిన అవసరముందన్నారు. ఉద్దానం ప్రాంతానికి కిడ్నీ వ్యాధులను బహుమతిగా ఇచ్చారని, బాధితులకు మంచినీళ్లుకూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణానికి రూ.10 లక్షలు కూడా కేటాయించలేక వదిలేశారని చెప్పారు. మందస జమిందార్లకు వ్యతిరేకంగా పోరాట చరిత్రను తిరగరాసేలా ప్రత్యేక హోదా సాధన కోసం యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరాంధ్రకు ఒక పైసా కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే ప్రభుత్వ పెద్దలు బాగుందంటూ ప్రశంసిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు అమ్మేయడానికి అది కేంద్ర ప్రభుత్వం జాగీరా అని ప్రశ్నించారు. తనకు 25 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా తీసుకువస్తామని చెప్పి చేతులెత్తేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని యువత ప్రశ్నించాలన్నారు.

సిపిఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జె.వి.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇస్తే పరిశ్రమలు తరలివచ్చి యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. ఉపాధి అవకాశాలు లేక శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పెద్దఎత్తున మత్స్యకారులు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ, మాట తప్పి యువతను మోసం చేశారని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇస్తామని హామీనిచ్చిన మోడీని వైసిపి, టిడిపి ఎందుకు పార్లమెంట్‌లో ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ప్రమాదకరమైన కొవ్వాడ అణు ప్రాజెక్టును బిజెపి ప్రభుత్వం ఉత్తరాంధ్రపై రుద్దుతోందని చెప్పారు. ప్రత్యేకహోదా, విభజన చట్టం హామీలను అమలు చేయకపోతే బిజెపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు గని రాజు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ప్రత్యేక హోదా సాధన సమితి ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సమర యాత్రకు పోలీసుల ఆటంకం

శ్రీకాకుళం నగరంలో సభ నిర్వహణకు నిర్వాహకులు సిద్ధం అవుతుండగా పోలీసులు ఆటంకం కల్పించారు. కుర్చీలు వేయకుండా అడ్డుకున్నారు. సభా వేదికను తీసేయాలని పట్టుబట్టారు. సభ అనుమతి కోసం డిఎస్‌పికి దరఖాస్తు చేసుకున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు లేఖ చూపినా, సభ నిర్వహణకు వీల్లేదంటూ సిఐ పి.శ్రీనివాసరావు చెప్పారు. సభకు వచ్చిన విద్యార్థులపై కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో గోవిందరావు, సిఐ మధ్య వాగ్వివాదం జరిగింది. తాము సభను నిర్వహించి తీరుతామని, ఏం చేసుకుంటారో చేసుకోండి అని గోవిందరావు ఖరాకండిగా చెప్పారు. విద్యార్థులు భారీ ర్యాలీగా తరలిరావడంతో పోలీసులు చేతులెత్తేశారు. పోలీసుల తీరుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీలపైకి దూసుకెళ్లిన లారీ

నలుగురు మహిళలు మృతి

ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీల పైకి లారీ దూసుకెళ్లడంతో నలుగురు మహిళలు మృతి చెందిన ఘటన ఆమదాలవలస మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మండలంలోని మండాదికి చెందిన కుర్మాన లక్ష్మి (45), మురువందల పాపమ్మ (55), అంబటి సత్తెమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన అమలాపురం గౌరమ్మ (50) పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో మృతి చెందింది.

గౌరమ్మ | లక్ష్మి | పాపమ్మ | సత్తెమ్మ

వార్త... మెయిన్ పేజీలో

'యువగళం'ను అడ్డుకునేందుకు కుయుక్తులు

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు వైసిపి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. మండలంలోని రాపాకలో ఇటీవల మృతి చెందిన పలువురు టిడిపి సానుభూతిపరుల కుటుంబసభ్యులను శనివారం పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందనను చూసి వైసిపి నాయకులకు వణుకు పుడుతుందన్నారు. అందుకే పాదయాత్రకు అడుగడుగునా ఆటంకం కల్పించేందుకు చూస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.శంకరభాస్కరరావు, అప్పలనాయుడు, మనోహరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - విశాఖపట్నం

రాష్ట్రంలో భూముల సమస్యలకు సత్వర పరిష్కారం కోసం ప్రాంతీయ రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు, ఇతర విషయాలు చర్చించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు సదస్సులు నిర్వహించామన్నారు. ఇప్పటికే తిరుపతి, విజయవాడలో ఈ తరహా సదస్సులు నిర్వహించామని, విశాఖలో చివరిది మూడో సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. భూమి రాష్ట్రాభివృద్ధిలో, ప్రజల ప్రమాణాలను పెంచేందుకు ఉపయోగపడే ప్రధాన వనరు అని చెప్పారు. అటువంటి భూమిని యజమాన్యం చేస్తున్న రెవెన్యూ శాఖ కాలానుగుణ మార్పులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత నిబంధనలు, చట్టాలను మార్పు చేసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. భూమిని పెద్ద ఎత్తున వినియోగంలోకి తీసుకుని రావాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారని తెలిపారు.

బ్రిటిషర్లు చేపట్టిన సర్వే రికార్డులనే ఇప్పటికీ ఉపయోగిస్తున్నామన్నారు. అందుకనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టిందని చెప్పారు. ఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇందుకు సంబంధించిన యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థాయిలో ఇందుకు సంబంధించి పని చేసేందుకు ఉద్యోగులను రిక్రూట్ చేశామని మంత్రి తెలిపారు. గతంలో సర్వే జరిగినప్పుడు చుక్కల భూములు అని, ఇంకా రక రకాల పేర్లతో ప్రజలకు వాటిపై హక్కులు ఇవ్వకుండా తాత్సారం జరిగిందని, అటువంటి భూములకు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న వారికి యాజమాన్య హక్కులు ఇచ్చే విధంగా నిబద్ధతతో, కాలానుగుణ ప్రణాళికతో చేపడుతున్నామని చెప్పారు. 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పారు. ఇందుకు రూ.12 వేల కోట్లు భూసేకరణ నిమిత్తం ఖర్చు చేయడం చిన్న విషయం కాదన్నారు. ప్రభుత్వ లక్ష్యాలపై రెవెన్యూ అధికారులు క్లారిటీ తెచ్చుకునేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఆటో మ్యుటేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చాక సంబంధిత ప్రక్రియ పూర్తయిన మరుక్షణమే ఆటో మ్యుటేషన్ జరుగుతుందన్నారు. భూమి వినియోగం పెరిగితే రాష్ట్ర జిడిపికి దోహదపడుతుందన్నారు. అంతకుముందు రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును ప్రారంభించారు. తదుపరి వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తూ మరణించిన కుటుంబీలకు 135 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. సదస్సులో సిసిఎల్ కమిషనర్ సాయిప్రసాద్, సర్వే అండ్ లాండ్ రికార్డ్సు కమిషనర్ సిద్ధార్థ్ జైన్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బి.రామకృష్ణ, సిసిఎల్ఎ అదనపు కమిషనర్ ఇంతియాజ్, శ్రీకాకుళం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒలు, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

సమయం లేదు.. సమీక్షించుకోవాలి

సమీక్షలో వైసిపి నాయకుల ఆవేదన

ప్రజాశక్తి - కవిటి

ఎన్ని చేసినా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఓటమిని చవిచూస్తున్నామని, లోపాలను సమీక్షించుకునేందుకు పంచాయతీల వారీగా సమయాన్ని కేటాయించాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌కు పలువురు సీనియర్ కార్యకర్తలు సూచించారు. మండలంలోని గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లతో స్థానిక అగ్నికుల క్షత్రియ భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్త బెందాళం రమణమూర్తి మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ నుంచి ఇప్పటి వైఎస్ఆర్ కాంగ్రెస్ వరకు ఆరు ఎన్నికల నుంచి గమనిస్తున్నానని, ఎంతో కష్టపడితే 2004 ఎన్నికల్లో కేవలం నాలుగైదు వేల మెజారిటీతో నరేష్ కుమార్ అగర్వాల్ విజయం సాధించారని చెప్పారు. అప్పట్నుంచి ఇప్పటివరకు విజయం అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత బలమైన నాయకత్వం, ఎన్నడూ లేని సంక్షేమ పథకాలు, ఇంతమంది వాలంటీర్లు, ఇప్పుడు గృహ సారథులు, కన్వీనర్లను నియమించారని, కొందరి లోపం పార్టీకి శాపం కాకూడదన్నారు. ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి మాట్లాడుతూ గృహ సారథులు, కన్వీనర్ల నియామకంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. స్థానిక నాయకులను సంప్రదించకుండానే తమకు నచ్చిన వారిని నియమించుకున్నారని చెప్పారు. ఇది సరైన పద్ధతి కాదని, పార్టీపై దీని ప్రభావం కచ్చితంగా ఉంటుందన్నారు. పార్టీలో కొత్తవారికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని, తొలి నుంచీ నమ్ముకున్న వారికి మొండిచేయి చూపిస్తున్నారని విమర్శించారు. దీనిపై చాలామంది కార్యకర్తలు, నాయకులు అసంతృప్తితో ఉన్నారని, దీనిపై దృష్టిసారించాలని కోరారు. రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వాలంటీర్లే తమకు పథకాలు ఇస్తున్నారని ప్రజలు చెప్తున్నారని, ఎక్కడా సిఎం జగన్ పేరు గానీ వైసిపి గుర్తు గానీ చెప్పడం లేదని వాపోయారు. పథకం ప్రభుత్వానిదైతే పేరు వాలంటీరుది వినిపిస్తోందదన్నారు. వాలంటీర్లు ఈ విషయం గుర్తించి ఇకపై వైసిపి గుర్తును, ముఖ్యమంత్రి పేరుని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని సూచించారు. సమావేశానికి గైర్హాజరైన 50 మందికి పైగా వాలంటీర్ల నుంచి ఎంపిడిఒ ద్వారా వివరణ తీసుకోవాలని సూచించారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని పిలుపునిచ్చారు. అందరం కష్టపడితే విజయం సాధిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైసిపి లీగల్ సెల్ కార్యదర్శి పులకల శ్రీరాములు, మండల కన్వీనర్ జల్లు యుగంధర్, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, ఎఎంసి చైర్మన్ బాబూరావు, మండలంలోని వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఆదివాసీ నాయకులకు బెదిరింపులు

- క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ఎస్‌పికి ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో బెంతు ఒరియాలు లేరని చాలాకాలంగా పోరాడుతున్న ఆదివాసీ సంఘ నాయకులను నకిలీ బెంతు ఒరియాలు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి అన్నారు. దీనిపై సంఘ నాయకులతో కలిసి కలెక్టర్, ఎస్‌పికి శనివారం ఫిర్యాదు చేశారు. నకిలీ బెంతుఒరియా విషయంపై ప్రభుత్వం నియమించిన కమిషన్ ఇటీవల జిల్లాలో పర్యటించిందని గుర్తుచేశారు. సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. జిల్లాలో బెంతుఒరియాలకు ఎస్‌టి సర్టిఫికెట్లు మంజూరు చేయరాదని ప్రభుత్వ ఆదేశాలున్నా, గత నెల 28వ తారీఖున కవిటి తహశీల్దార్ ఆర్.అప్పలరాజు బెంతు ఒరియాలకు ఎస్‌టి ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారని చెప్పారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో నిజంగా బెంతు ఒరియాలు ఉంటే వారికి కుల ధ్రువీకరణ పత్రాల అందజేసే అధికారం రెవెన్యూ డివిజన్ అధికారికి మాత్రమే ఉందని, తహశీల్దార్ లేదని చెప్పారు. కొంతమంది వ్యక్తులు బెంతు ఒరియా సంఘమని చెప్పుకుని తనకు ఫోన్ చేసి అంతు చూస్తామంటూ బెదిరింపులు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ వివాదానికి కారకులైన కవిటి తహశీల్దార్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు, సవర జగన్నాయకులు, ఎర్ర.రాజు, ఆదివాసీ ఉద్యోగాల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి సమాన కూలి

ప్రజాశక్తి - లావేరు

ఉపాధి హామీలో మహిళలు, పురుషులకు సమాన కూలి అందుతుందని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో చేపడుతున్న అమృత్ సరోవర్ చెరువు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, సాధారణంగా బయట పనులకు వెళ్తే మగవారికి, ఆడవారికి కూలిలో తేడా ఉంటుందన్నారు. ఉపాధి హామీలో మాత్రం ఇరువురికీ సమాన కూలి అందుతుందని తెలిపారు. రెండు పూటలా పనిచేయడం ద్వారా గరిష్ట కూలిని పొందవచ్చని చెప్పారు. వంద రోజుల పని దినాలను జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసాను ఇస్తుందన్నారు. రోజుకు కనీసం ఆరు గంటల పాటు పనులు చేయాలన్నారు. గరిష్ట కూలి పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు, సమస్యలు ఉంటే సిబ్బంది పరిష్కరిస్తారని చెప్పారు. 150 పని దినాలు కల్పించాలని కూలీలు కోరగా, ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిడి శైలజ, ఎపిఒ సత్యవతి, ఇసి లెనిన్‌బాబు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మిసెస్ ఇండియా టాలెంటెడ్‌గా రజని

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మిసెస్ ఇండియా టాలెంటెడ్ ప్రెస్టీజియస్ టైటిల్ విజేతగా పైడి రజని నిలిచారు. రాజస్థాన్‌లోని సిటీ ఆఫ్ టైగ్రెసెస్ రంతంపోర్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీలకు హాజరైన ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్, మిసెస్ ఎవిఎన్ కళాశాల ఇంగ్లీష్ హెచ్‌ఒడి, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షులు రజని ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఆలిండియా డైరెక్టర్ దీపాలి ఫడ్నిస్ చేతుల మీదుగా టైటిల్‌ను అందుకున్నారు. ఆంధ్రా కూచిపూడి నృత్యం, నండూరి ఎంకి వేషధారణ, సంప్రదాయ వస్త్రధారణ, ఆంధ్రా వంటకాల తయారీ, దేశభక్తిని పెంపొందించే నాట్యప్రదర్శన, గిరిజన సంప్రదాయ వస్త్రధారణ, గిరిజన థింసా నృత్యం, జంగిల్ సఫారీ రౌండ్లలో రజని ప్రతిభ కనబరిచారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల తరపున రజని పాల్గొని టైటిల్‌ను గెలుచుకున్నారు.

'ఐప్యాక్' రాజకీయాలు

రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నికల ప్రచారం ఏనాడో మొదలైంది. ప్రధాన పార్టీల వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ప్రజల్లో తిరిగి స్థానం సంపాదించుకోవాలన్న తపనతో విమర్శలు, ప్రతి విమర్శల తూటాలు స్థాయి దాటి క్షిపణుల్లా దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికార వైసిపి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి పాలనలో లోటుపాట్లను గుర్తించి జాగ్రత్త పడే ప్రయత్నాలను మొదలుపెట్టే పనిలో పడినట్లు కనిపిస్తోంది. 175 సీట్లు వై నాట్ అన్న నినాదం వెనుక మేకపోతు గాంభీర్యం కనిపిస్తోందని ఆ పార్టీ సీనియర్లే అంగీకరించే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో పార్టీ నిర్ణయాలే అంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మదిలో నుంచి వచ్చినవనే అందరూ భావించే పరిస్థితి ఉంది. జగన్ నిర్ణయాలు వెనుక ఐప్యాక్ రాజకీయాలు దండలో దారంలా ఉందని చాలామంది సీనియర్లకే తెలియని పరిస్థితి ఉంది. కార్పొరేట్ రాజకీయాల్లో ప్రజల పాత్ర లేకుండా వ్యూహకర్తల పాత్ర వెలుగులోకి వచ్చింది. జిల్లా రాజకీయాలు, పాలనా వ్యవహారాలు అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ బృందాలు ప్రభుత్వ పనితీరు ఎలా ఉందన్న దాన్ని ప్రత్యక్షంగా మంత్రుల ముందుంచేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఇటీవల ఎల్లో మీడియాగా ప్రచారం చేస్తున్న పత్రికలు, ఛానళ్లను వదిలి మిగిలిన వాటి ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశానికి వైసిపి కార్యాలయం నుంచి ఐప్యాక్ ప్రతినిధుల నుంచి జర్నలిస్టులకు ఫోన్లు వచ్చాయి. ఆ సమావేశానికి ఆహ్వానించని వారితో సహా సుమారు 35 మంది వరకు హాజరయ్యారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణతో, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు ఇతర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆ సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ పనితీరు, ప్రజా సమస్యల గురించి మంత్రి బొత్స చర్చను ప్రారంభించి, మీ నుంచి సమాచారం తెలుసుకునేందుకే సమావేశం ఏర్పాటు చేశామని చెప్పడం విశేషం.

జర్నలిస్టులు తమ సమస్యలపై ప్రభుత్వ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఐప్యాక్ గుర్తించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ప్రారంభంలో జర్నలిస్టుల ప్రతినిధుల తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ఉందని, కనీసం అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడానికి సిద్ధం కాకపోవడం దుర్మార్గమని స్పష్టం చేశారు. సమాచారశాఖ మంత్రి కూడా తానేమీ చేయలేనని చేతులెత్తేశారని జర్నలిస్టులు చెప్పారు. మార్చి చివరి నాటికి ఇతర సమస్యల్లో కొన్నింటినైనా పరిష్కరిస్తామని, అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని మంత్రి బొత్స భరోసానివ్వడం విశేషం. ఇతర సమస్యలపై ప్రస్తావించినప్పుడు ఉద్యోగులు, ఉపాధ్యాయుల వ్యవహారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ప్రభుత్వానికి నష్టం కలిగిస్తుందని చెప్పడంతో, ఏముంది వారు ఆరు శాతం ఉంటారని మంత్రి అనడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైసిపి అధికారంలోకొచ్చాక జిల్లాలో ఏ ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని, బిల్లులు చెల్లించక పనులు నిలిచిపోయాయని జర్నలిస్టులు చెప్పారు. కనీసం రోడ్లు అయినా మరమ్మతులు చేయడం లేదని ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో ఇచ్చిన హామీలకు దిక్కు లేదని మీ పాలనలో ఏముంది గర్వకారణమని జర్నలిస్టులు మంత్రుల ముందు స్పష్టం చేశారు. మార్చి తర్వాత పనులు ప్రారంభిస్తామని మంత్రి చెప్పడం తప్ప ఏమీ చేయలేరన్నది రాష్ట్ర పరిస్థితి చెప్తోంది.

ఐప్యాక్ బృందంలో ఇతర రాష్ట్రాల్లో నివసిస్తూ తెలుగు వచ్చిన వారు, రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. బీహార్ నుంచి ఓ యువతి ఐప్యాక్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ముఖ్య నేతలు మీడియాలో ఏం మాట్లాడాలో ఆమె సూచనలు ఇస్తూ పార్టీ కేంద్ర కార్యాలయానికి ఆమె సమాచారం అందిస్తే, అక్కడ్నుంచి జిల్లాల నాయకులకు ఆ సమాచారం చేరవేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని మంత్రులు, స్పీకర్‌కు ఆమె పంపిన సమాచారంతోనే ప్రెస్‌మీట్ పెడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆమె కేంద్రంలో ఉండకుండా అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ ముఖ్య నేతలను కలుసుకొని వచ్చి వెళ్తున్నారని తెలిసింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో జగన్ పాలన కంటే ఐప్యాక్ పాలన సాగుతున్నట్లు ఆ పార్టీ నేతల్లో ప్రచారం సాగుతోంది. అందుకు పలు ఉదాహరణలు ఉన్నాయి.

వాలంటీర్ల పరిధిలో ఇద్దరు గృహ సారథులను, సచివాలయం పరిధిలో ముగ్గురు చొప్పున సమన్వయకర్తలను నియమించడం, బూత్ కమిటీ కన్వీనర్ల ప్రాధాన్యత తగ్గించడం ఐప్యాక్ వ్యూహంలో భాగమేనని తెలిసింది. ఇప్పటికే ఉన్న బూత్ కమిటీ కన్వీనర్లు సచివాలయం సమన్వయకర్తలుగా అవతారం ఎత్తినట్లు తెలిసింది. అజమాయిషీ చేసే వారి దొంతర్లు ఎక్కువ కావడంతో విభేదాలకు, గ్రూపుల ఏర్పాటుకు దారులు వేస్తున్నట్లు అయిందని సీనియర్లు భయపడుతున్నారు. మంత్రులు ఏం మాట్లాడాలో ఐప్యాక్ నిర్దేశిస్తున్న ప్రజాస్వామ్య పాలనలో ఉన్నాం. నిన్నటివరకు విశాఖ రాజధాని లేదంటే ప్రత్యేక రాష్ట్రం అన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యల వెనుక ఐప్యాక్ వ్యూహం ఉందని ఇప్పుడు అర్థమవుతుంది. తాజాగా మంత్రి సీదిరి అప్పలరాజు వ్యాఖ్యలు మరింత అద్దం పడుతున్నాయి. ఆయన మందస మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతూ రాజధాని వ్యవహారాన్ని ప్రస్తావించారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న నినాదం వినిపించిన జగన్, రాజధాని విషయంలో ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని ఆమోదించి, ఆ తర్వాత మాట తప్పడం, మడమ తిప్పడం చరిత్రను చింపేస్తే చెదిరిపోదు.

జిల్లా వైసిపిలో నెలకొన్న గ్రూపుల గోల, అసంతృప్తి సెగలపై నెల్లూరు జిల్లా పరిణామాల అనంతరం అధినేత ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిసింది. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో తీవ్రంగా, మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో తరతమ తేడాల్లో ఉంది. ముఖ్యంగా వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేట నియోజకవర్గంలో మండల నేతల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కృష్ణదాస్ వ్యవహారశైలిపై వారు గుర్రుగా ఉన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో సమాంతరంగా రెండు గ్రూపులు పనిచేస్తున్నాయి. పాతపట్నం అయితే మంటలు లేస్తున్నాయి. పలాస నియోజకవర్గంలో మంత్రి సీదిరి అప్పలరాజును మార్చకపోతే ఓడిస్తామన్న స్థాయి నిరసన సెగలు ఎగిసిపడుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో బుజ్జగించి భరోసానిచ్చినా ఇరువైపులా నిరసనలు, సహాయ నిరాకరణలు కొనసాగుతున్నాయి. ఇచ్ఛాపురంలో గ్రూపుల గోల రావణకాష్టం అవుతుందన్న భయం వెంటాడుతోంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రత్యర్థుల పోరు కంటే కుటుంబసభ్యుల పోరు ఉంది. ఇలాంటి సమయంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలతో త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడడానికి సిద్ధమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. అసంతృప్తులు ఎందుకు?, ఎవరు కారణం? పరిష్కారం ఏమిటన్న దానిపై నేతలతో చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఇప్పటి సమాచారం బట్టి ఇద్దరికి తిరిగి టిక్కెట్ ఇవ్వరని సమాచారం.

- సత్తారు భాస్కరరావు



రైతులకు సూచనలు ఇస్తున్న కృష్ణారావు

వేరుశనగలో జిప్సం వాడాలి

ఆత్మ పీడీ కృష్ణారావు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

వేరుశనగ నాటి 40 రోజుల లోపు ఎకరాకు 200 కేజీలు వేయడం ద్వారా గింజ నాణ్యత పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆత్మ పీడీ కూటికుప్పల కృష్ణారావు అన్నారు. మండలంలోని నరసాపురం పంచాయతీ ఆకులు సతివానిపేటలో వేరుశనగ పంటను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిప్సం వేసిన తరువాత రెండో గొప్పు తవ్వేటప్పుడు మట్టిని మొక్క చుట్టూ వేయాలనానరు. దీంతో ఎక్కువ ఊడలు వేస్తాయని పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు నాటే ముందు శాఫ్‌ను కలిపి నాటాలన్నారు. వేరుశనగ విత్తనాలు వరుసుల్లో నాటాలన్నారు. కార్యక్రమంలో ఎడిబివి తిరుమలరావు, నైర డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.వెంకటరావు, వ్యవసాయ అధికారులు జి.శ్రీలక్ష్మి, ఎం.శ్రీనివాసబాబు, అగ్రి కల్చలర్ అసిస్టెంట్లు ఎం.పావని, డి.సాయిరాజ్, ఎఇఒ పేడాడ సురేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రైతులే నాణ్యమైన పంటను సేకరించి విత్తనాలను తయారు చేసుకోవాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని గంగారాం పంచాయతీ పరిధిలో సుమారు 25 ఎకరాలకు పైగా వేరుశనగ పంటను వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటలో నాణ్యమైన పంటను సేకరించి, శుద్ధి చేసుకుని గ్రామంల్లోనే మేలు రకమైన విత్తనాలను అభివృద్ధి చేసుకోవడం వల్ల రైతులకు డబ్బులు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ పీడీ కృష్ణారావు, ఎడి తిరుమలరావు, ఎఒ గోవిందరావు, విత్తనాభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న సత్యవతి

బిజెపి, వైసిపిది చీకటి పాలన

డిసిసి అధ్యక్షులు సత్యవతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపిలు చీకటి పాలన చేస్తున్నాయని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి విమర్శించారు. పట్టణంలోని కంద్రపేట, పూజారిపేట, ఐ.జె.నాయుడు కాలనీ ప్రాంతాల్లో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో హథ్ సే హథ్ జోడో అభియాన్ యాత్ర శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. చేయిచేయి కలుపుదాం రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామని నినాదాలు చేస్తూ పాదయాత్రను కొనసాగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, పప్పల రమణ, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, బొత్స వెంకటరమణ, కూన సుందరరావు, గురుగుబెల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. స్థానిక మార్కెట్ యార్డులో సచివాలయ కన్వీనర్లకు, గృహ సారథులకు, వాలంటీర్లకు శనివారం నిర్వహించిన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్

ఆమదాలవలస : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

బొడ్డేపల్లి నిరంజన్, గురుగుబెల్లి నీలారావు, కూటికుప్పల సన్యాసిరావు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని పైడిభీమవరంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ప్రత్యేక పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లడానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పొడుగుపాడు శ్రీరామమందిరం ఆలయ ప్రాంగణంలో జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, సచివాలయ కన్వీనర్లు ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న పాల్గొన్నారు.

కేన్సర్‌ను తరిమికొడదాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తూ నిండు ప్రాణాలు బలిగొంటున్న కేన్సర్ వ్యాధిని సమూలంగా నాశనం చేసేందుకు సమాజంలో అందరమూ సమిష్టిగా కృషి చేయాలని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జెమ్స్ ఆస్పత్రి ఆంకాలజీ విభాగం, స్టార్ వాకర్స్, రోటరీ క్లబ్‌లు సంయుక్తంగా ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ కూడలి వరకూ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.నరేంద్ర మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గుండె జబ్బుల తర్వాత అత్యంత ప్రమాదకరమైన వ్యాధి కేన్సర్ అని, అసాధారణ కణాలు పెరగడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందని అన్నారు. ఆరోగ్య నియమాలు పాటించాలని, నిత్యం వ్యాయామం చేయాలని అన్నారు. మద్యపానం, దూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, రోటరీ ప్రతినిధి, సామాజికవేత్త మంత్రి వెంకటస్వామి, జెమ్స్ మెడికల్ కాలేజీ ప్రతినిధులు డాక్టర్ డి.ప్రవీణ్, ఆబోతుల రామ్మోహనరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఐకె.రావు, పూన్న నాగభూషణ్, కిల్లారి రవి, జామి రాధాకృష్ణ పాల్గొన్నారు.

అలాగే సాయి డెంటల్ కాలేజి రిసెర్చు ఇన్సిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యాన నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి డేఅండ్‌నైట్ వరకు డెంటల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

టెక్కలి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు అన్నెపు వినోద్ కేన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ, అధ్యాపకులు లూక్‌పాల్, రాంబాబు, హరి, సుగుణదనరావు, శివాజీ, కసవయ్య పాల్గొన్నారు.

పొందూరు : ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న డెంటల్ విద్యార్థులు

పురస్కరించుకుని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన విద్యార్థులతో కలిసి అవగాహనా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఉమామహేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ జె.రమేష్, ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్, హెచ్‌సి జగన్‌మోహన్, ఆర్‌ఎంపి వైద్యులు ఎ.రాము, వాసు, రవి, కొల్లి శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని చిన్నబాడం పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలో జాతీయ కేన్సర్ డే సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణయ్య, ముడిమంచి జోగారావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ విద్యాసాగర్

పొదుపు నుంచి అప్పులు తీసుకోవచ్చు

ప్రజాశక్తి- ఆమదాలవలస

తమ సొంత నిధులైన పొదుపుల నుంచి సంఘం సభ్యులు అప్పులు తీసుకోవచ్చునని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ డి.విద్యాసాగర్ అన్నారు. మండల కేంద్రంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మండల మహిళా సమాఖ్య నెలవారీ పాలకవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సంఘాలతో పాటు అన్ని స్వయం శక్తి సంఘాలూ విధిగా పంచ సూత్రాలు పాటించాలన్నారు. సంఘానికి గ్రేడింగ్ రావాలంటే షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలోనే ఆర్థిక లావాదేవీలు, పొదుపులు, అప్పులు మంజూరు చర్చించారు. సంఘ సమావేశం నిర్వహించినప్పుడే సభ్యులు చర్చించిన అంశాలను తీర్మానం పుస్తకంలో నమోదు చేసుకోవాలన్నారు. అన్ని సంఘాలూ కమ్యూనిటీ ఆడిట్ సిఆర్‌పితో లెక్కలను తనిఖీ చేయించుకుని సంగ్రహ పట్టికలు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. చేయూత డిపిఎం చింతాడ రామ్మోహన్ మాట్లాడుతూ లబ్ధిదారులంతా జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. డిపిఎం ఐ.బి.మోహనరావు మాట్లాడుతూ అన్ని సంఘాలూ షెడ్యూల్ ప్రకారం మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహించాలని సూచించారు. డిపిఎం ఫైనాన్స్, ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ గ్రామ సంఘాల బుక్ కీపింగ్ ఆన్‌లైన్‌లో నెలవారి నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎపిఎం పైడి కూర్మారావు మాట్లాడుతూ గతంలో పోల్చుకుంటే మండలంలో అన్ని గ్రామ సంఘాల్లో స్త్రీనిధి, సిఐఎఫ్ రీపేమెంట్ సక్రమంగానే నిర్వర్తిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య కోశాధికారి రేణుక, కార్యదర్శి వేనమ్మ, అకౌంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.

'యువగళం'తో అధికార పార్టీలో వణుకు

ప్రజాశక్తి- పలాస

జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రతో అధికార పార్టీ వణుకుపోతుందని, పాదయాత్రకు విశేష స్పందన చూసి వైసిపి నాయకులు భయపడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకేష్‌కు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకే పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని ఆటంకాలు సృష్టిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లే స్వతంత్రం ఉందని, వైసిపి నాయకులు గుర్తెరగాలని హితవుపలికారు. ప్రజల పడుతున్న ఇబ్బందులు తెలుసుకోవడమే యువగళం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌతు శిరీష

ఉద్దేశ్యమన్నారు. యువగళం విజయవంతం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు శశి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నవీన్, వాసు, నాబిల్లి శ్రీను, లండ ధనరాజ్, కిరణ్, ఢిల్లీ, ధనుంజయ, చంద్రశేఖర్, చక్రధర్, ధర్మ, శివాజీ, చిన్న పాల్గొన్నారు.

కేసుల రాజీకి సహకరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి రాజీ మార్గాన్ని ఎంచుకుని ఇరు గ్రూపుల మధ్య సయోధ్య కుదర్చాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఈ నెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకునేందుకు జిల్లాలోని న్యాయమూర్తులు సహకరించాలన్నారు. శనివారం వివిధ కోర్టుల్లో ఉన్న న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన లోక్ అదాలత్ మాదిరిగానే ఈ సారీ ఎక్కువ కేసుల పరిష్కారానికి తోడ్పాటు అందించాలన్నారు. కోర్టుల స్థాయిలో రాజీమార్గాన్ని న్యాయవాదులకు సూచించాలని అన్నారు.

లోక్ అదాలత్ ఓ చక్కని వేదిక

పలాస : పరిష్కరించుకోదగ్గ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ఒక వరమని జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్ అన్నారు. పలాస కోర్టులో పోలీస్, రెవెన్యూ, ఎస్ఇబి, ఎక్సైజ్ మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 11న నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం

పలాస : మాట్లాడుతున్న జడ్జి రవిశంకర్

చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ తాగాదాల పరిష్కారానికి చక్కని వేదికని పేర్కొన్నారు. సమావేశంలో తాంధ్ర మురళి, పిండి వెంకటరమణ, బి.కె.ఆర్.పట్నాయక్, పి.ఎల్.నారాయణ, జి.ఎం.ఎస్.అనీల్‌రాజ్, ఎస్.వి.రమణ, చిట్టిబాబు, పైల రాజారత్నం నాయుడు, మహమ్మద్ ఘని, ఎపిపి రమేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి- టెక్కలి

జాతీయ ఉపకార వేతనం ఎంపిక నిమిత్తం ఆదివారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. టెక్కలి డివిజన్ పరిధిలోని పన్నెండు మండలాల నుంచి 2,600 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం టెక్కలి పట్టణంలోని పదకొండు పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు పదకొండు మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఛీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కావడంతో ఆన్‌లైన్ ద్వారా సెంటర్లని పర్యవేక్షించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. పరీక్షల నిర్వహణ నిమిత్తం 110 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. ఉదయం 10 నుంచి నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఆయా పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని హాల్‌టిక్కెట్ల ద్వారా తెలియజేశారు. పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి పంపించే అవకాశాలు లేనందున ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షాల కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని నియమించారు. అలాగే పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లెప్రసీపై అవగాహన

జలుమూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ ఆధ్వర్యాన లెప్రసీపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీరంపై నొప్పి, స్పర్శ లేని అనుమానాస్పద మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ప్రాథమిక దశలోనే ఇలా వ్యాధిని గుర్తించినట్లయితే నివారణ సాధ్యమవు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

తుందని అన్నారు. జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.దుర్గారావు, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నరాజులు, కళాశాల అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే బడ్జెట్ బూటకం

టెక్కలి : ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్ బూటకమని ఆంధ్రా-ఒడిశా ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేశంలో ధనవంతులకు, కార్పొరేట్ వ్యక్తులకు, ఆర్థికంగా ముందుండే వారికి బడ్జెట్ ఉపయోగపడే విధంగా ఉందన్నారు. వందేభారత్ రైలుపై చూపించే శ్రద్ధ సాధారణ ప్రయాణికులు తిరిగే పాసింజర్ రైళ్లపై చూపలేదని అన్నారు. రైల్వే

పరమేశ్వరరావు

జోన్ కోసం రూ.పది కోట్లు కేటాయించడం చూస్తుంటే ఎవ్వరిని సంతృప్తి పరచడానికని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో పలాస రైల్వే లైన్ కోసం గత బడ్జెట్‌లో పెట్టారని, ఆది నేటి వరకు అతీగతీలేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కేటాయించిన నిధులు సాదారణమే తప్ప ప్రత్యేకంగా ఏమిచ్చారని ప్రశ్నించారు. సీనియర్ సిటిజన్లకు, విద్యార్థులకు యాత్రికులకు కేటాయించాల్సిన రాయితీలపై మౌనం వహించారన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సోంపేట: మండలంలోని బారువ, సుంకిడి పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు శనివారం శంకుస్థాపన చేశారు. బారువలో

మంచినీళ్ల ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపిపి దాసు

ప్రభుత్వ నిధులతో నిర్మించి న మంచినీళ్ల ట్యాంకను ప్రారంభించారు. అలాగే కోరంజిభద్రలో బస్ షెల్టర్ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుర్రెల శ్రీను, ఎంపిటిసి టి.పద్మావతి, బుజ్జి, సర్పంచ్‌లు ఎర్ర రజిని, సిలగాన భాస్కరరావు, ఎస్.జహరీష్, బి.శ్రీకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం పాల్గొన్నారు.

జనం కోసం 'జనసేన'

సరుబుజ్జిలి : మండలంలోని పెద్దపాలెంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతా లు, షణ్ముఖ వ్యూహం, పవన్ కళ్యాణ్ కౌలు రైతులకు అండగా నిలబడే విధానం గురించి ప్రజలకు వివరించారు. నియోజకవర్గం లో జనసేన పార్టీని గెలిపిస్తే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని అన్నారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని ఆ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. జనసేన నాయకులు మురళీమోహన్, మిన్నరావు, సత్యనారాయణ, గణేష్, కోటి, రాధాకృష్ణ, సాగర్, కృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న రామ్మోహనరావు

నేడు 'అరసం' జిల్లా మహాసభ

శ్రీకాకుళం అర్బన్ : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా మహాసభ ఆదివారం స్థానిక క్రాంతి భవన్‌లో నిర్వహిస్తున్నామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. 80 ఏళ్ల పూర్తి చేసుకున్న అరసం రాష్ట్ర మహాసభలు తెనాలిలో ఈ నెల 10-11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యంలో జిల్లా శాఖ మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా కళింగాంధ్ర సాహిత్య సదస్సు ఏర్పాటు చేశామని, వివిధ ప్రక్రియలపై ఆయా రంగాల ప్రముఖులు మాట్లాడతారని వివరించారు. అట్టాడ అప్పలనాయుడు (నవల), దాసరి రామచంద్రరావు (కథ), అరుణ్ బవేరా (కవిత్వం), గార రంగనాథం (ప్రాచీన సాహిత్యం), పత్తి సుమతి (గురజాడ దృక్పథం), చిట్టి వెంకటరావు (రంగస్థలం), గూన అప్పారావు (సినిమా), నల్లి ధర్మారావు (చరిత్ర) అంశాలపై మాట్లాడతారని అన్నారు. అభ్యుదయం కోరుకునే వివిధ సంస్థల ప్రముఖులు సందేశాలు ఇస్తారని, ఉదయం 10 గంటలు నుంచి మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. అభ్యుదయం కోరుకునే వారంతా ఆహ్వానితులేనని అన్నారు.

తులసిపేట దళితుల ర్యాలీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని చిట్టియవలస రెవెన్యూ పరిధిలో ఉన్న తులసిపేట దళితులకు ప్రభుత్వం ఇచ్చిన డిపట్టా భూములను వెంటనే అప్పగించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి డిమాండ్ చేశారు. మండలంలోని తులసిపేటలో డిపట్టా భూముల లబ్ధిదారులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా ఫలాలు అందక దళితులు దయనీయంగా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపట్టాలు పేదల చేతుల్లో... భూములు ఆక్రమణదారుల

ర్యాలీ నిర్వహిస్తున్న దళితులు

చేతుల్లో ఉండడానికి పాలకుల నిర్లక్ష్య వైఖరే కారణమని అన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ నాయకులు చిట్టి సింహాచలం, చిట్టి వెంకటరావు, దేవాది రామకృష్ణ, కొల్లి శాంతారావు, కిర్రు శకుంతలమ్మ, చిట్టి ముసలయ్య, కొల్లి శాంతమ్మ, కోతి అసిరయ్య, చిట్టి రాము, కంచరాపు ఆరుద్రమ్మ, ప్రియ అప్పారావు పాల్గొన్నారు.

బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి రూరల్ : ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర నాయకులు వాబ యోగిని బెదిరిస్తూ ఫోన్ కాల్ చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పరిషత్ జిల్లా నాయకులు వరహాల కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఆదివాసీలు ఉన్నప్పటికీ హక్కులకు భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతరలకు పట్టాలు కల్పించి నిజమైన ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీనిపై పోరాటం చేస్తున్న నాయకులను బెదిరించడం సమంజసం కాదని అన్నారు. ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరులో నిషేధం ఉన్నా... కవిటి తహశీల్దార్ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడం అధికార దుర్వినియోగమని అన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సవర చొక్కారావు, యర్ర రాజారావు, జగ్గారావు, సింహచలం ఉన్నారు.

పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

బాతువ మాజీ సర్పంచ్ మృతి

జి.సిగడాం : మండలంలోని బాతువ మాజీ సర్పంచ్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ముళ్ల నారాయణప్పడు (79) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్, ఎంపిపి ప్రతినిధి మీసాల రమణ, మండల పార్టీ ప్రెసిడెంట్ బూరాడ వెంకటరమణ, నాయకులు జగన్నాథం, వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాద్, బాతువ పిఎసిఎస్ చైర్మన్ పల్లాడ సన్యాసిరావు, మండలి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్కా వెంకటసాయి, నాయకులు చిత్రి మోహన్, బాణాన సూర్యనారాయణ, తొత్తడి రామారావు, బాలి అప్పలసూరి, లుకలాపు అనిల్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

వ్యక్తికి గాయాలు

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి దన్నానపేట సమీపంలో శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో కృష్ణాపురానికి చెందిన కాంక్రీట్ మిల్లర్ మేస్త్రీ గొర్లె ఆదినారాయణ గాయపడ్డాడు. ఆదినారాయణ రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. వెంటనే స్థానికులు శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు బంధువులు తెలిపారు.

పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

గడ్డివాములు దగ్ధం

సంతబొమ్మాళి : సంతబొమ్మాళికి చెందిన వెలమల అప్పారావు, అల్లు చినబాబుకు చెందిన పదెకరాల గడ్డివాములు శనివారం దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం సంఘటన స్థలానికి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, తహశీల్దార్ జాలరి చలమయ్య, ఎంపిడిఒ జి.ఉమాసుందరి వెళ్లి ప్రమాదానికి గల కారణం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎ.చంద్రమౌళి, కార్యదర్శి ఎస్.మల్లేశ్వరరావు, విఆర్‌ఒ రమేష్, సరంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు, వాదాల దుర్గారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాదరావు

వెంకటేష్‌ది రోడ్డు ప్రమాదమే

ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షు లు మాదారపు వెంకటేష్‌ది రోడ్డు ప్రమాదమేనని ట్రాఫిక్ డిఎస్‌పి జి.వి.వి ప్రసాదరావు స్పష్టం చేశారు. నగరంలోని ట్రాఫిక్ డిఎస్‌పి కార్యాలయ ఆవరణలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని టిడిపి కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా అధ్యక్షులు జి.నర్సునాయుడుతో కలిసి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా, వెనుక నుంచి కారు ఢీకొట్టిందని తెలిపారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా, నర్సునాయుడు స్వల్పగాయాలతో బయటప డ్డారని చెప్పారు. వెంటనే స్థానికులు హుటాహుటిన మెడికవర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడకు చెందిన పాకల సురేష్ కారుతో ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడం వల్ల అనుమానాలకు దారితీసిందన్నారు. నిందితుడు సురేష్ శనివారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవ డంతో, ట్రాఫిక్ పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని సీన్ రీక్రియేషన్ చేయించారు. సిసి కెమెరాల్లో నమోదైన సాంకేతిక వివరాలకు, నిందితుడు సురేష్ చెప్పిన వాటికి సరిపోయిందని తెలిపారు. ఇందులో ఎటువంటి కుట్ర కోణం లేదన్నారు. ఇది యాధృచ్ఛికంగా చోటుచేసుకుందని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసినట్లు చెప్పారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి

రోడ్డు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, పలువురు టిడిపి నాయకులు ఎస్‌పి రాధికను కలిసి కోరారు. రోడ్డు ప్రమాదం సంభవించిన తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు.

విలేకరి మృతి

కోటబొమ్మాళి: సీనియర్ విలేకరి ముద్దాడ మోహనరావు (61) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతూ రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. శనివారం పరిస్థితి విషమించి

మోహనరావు (ఫైల్)

మృతి చెందారు. ఈయనకు భార్య సుందరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఉదయం పత్రిక ద్వారా పత్రికారంగంలోకి చేరి ఆంధ్రప్రభ, సాక్షి తదితర దినపత్రికల్లో రిపోర్టర్‌గా పనిచేశారు. మోహనరావు మృతిపై కోటబొమ్మాళి ప్రెస్‌క్లబ్ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను విలేకరులు తిర్లంగి రవికుమార్, సనపల రమేష్, కల్లేపల్లి శివప్ర సాద్, బలగ తేజేశ్వరరావు, రాజు, అప్పన్న పరామర్శిం చారు. అలాగే ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్‌లు మోహనరావు మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

ఆమదాలవలస : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మూడున్నరేళ్లలో సిఎం జగన్ పాలనలో నవరత్నాల సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలోని ప్రతి గడపలో సంక్షేమ ఫలాల వెల్లువ తెలియవస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధిలోని జగ్గుశాస్త్రులపేట, బైరిశాస్త్రులపేటల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునే నూతన ఒరవడికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కె.అప్పలనాయుడు, ఎఇ బి.సృజన, ఆర్ఐ డి.రామారావు, విద్యుత్‌శాఖ ఎఇ జి.రామారావు, టిడ్కో ఎఇ రమేష్, నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, డి.శ్యామలరావు, ఎస్..రామారావు, పి.తిరుపతిరావు, ఎం.కూర్మారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సంతబొమ్మాళి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాలతలగాంలో గడపగడపకు మన

సంతబొమ్మాళి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధిలు నక్క భీమారావు, పొందల రామకృష్ణ, సర్పంచ్ ఎన్. అప్పన్న, ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఎఒ జి.శ్రీలక్ష్మి, ఎంఇఒ జె.చిన్నవాడు, ఎస్ఐ కె.మధుసూదనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నీలవేణి

పశు వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస/సరుబుజ్జిలి

ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన సరుబుజ్జిలి మండలం ఇసకలపాలెంలో నిక్రా పథకం కింద పశు వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను పశు వైద్య శిబిరం ఆవశ్యకతను వివరించారు. పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం పశువులలో తరచూ వచ్చే వ్యాధులు వాటి నివారణ చర్యలు గురించి వివరించారు. పాల దిగుబడిని పెంచే సూచనలు, పశు గ్రాసాల రకాలు, టీకాల ఆవశ్యకత, పశువుల్లో చూడు నిలబడే మార్గాలు, ప్రభుత్వం ద్వారా అందే పథకాల గురించి అవగాహన కల్పించారు. కెవికె విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ సిపాన నీలవేణి మాట్లాడుతూ పశు సంపద ద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయం చేయవచ్చునని, పశుగ్రాసాలను పెంచుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి డి.సతీష్ మాట్లాడుతూ జబ్బ వాపు, ఇతర టీకాలను పశువులకు ఇప్పించాలని రైతులకు తెలిపారు. రైతులు ఈ పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్.బాలకృష్ణ, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న జిసిసి గొడౌన్

కూలేందుకు సిద్ధంగా జిసిసి గోదాము

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని హర్షబాడ పంచాయతీ మలియాలింగుపురంలో ఉన్న జిసిసి గొడౌన్ కూలేందుకు సిద్ధంగా ఉంది. ఆయా పరిధిలోని గ్రామాల గిరిజన వినియోగదారులు ఇబ్బందులు తప్పడం లేదు. గిరిజనుల సౌకర్యార్థం ఐటిడిఎ ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీకి గొడౌను ఏర్పాటు చేశారు. అది శిథిలావస్థకు చేరడంతో హైదరాబాద్‌కు వెళ్లే సరుకులు నిల్వ ఉంచడానికి ఇబ్బందిగా మారింది. దీంతో వర్షాకాలంలో సరుకులు తడిసిపోతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ చూపి నూతన భవనాన్ని నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

స్వరూప్ పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని 80 అడుగుల రోడ్డులో శుక్రవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ గాయపడి మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు మెండ స్వరూప్ శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన కుమారుడు మాదారపు డేవిడ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు నక్కరామరాజు, సిపాన రామారావు, కనపల తేజ, లక్ష్మణ్, వెంకట్ ఉన్నారు.

7 నుంచి పొలబండి

రణస్థలం రూరల్ : ఈ నెల 7 నుంచి రైతులు పండించిన మొక్కజొన్న పంటల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎఒ విజయ భాస్కర్ అన్నారు. రణస్థలం రైతు బరోసా కేంద్రం వద్ద వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయ సంచకులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలంబడిలో రైతులకు అర్థమయ్యేలా అవగాహనా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో 14 వారాలు పాటు అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎఒ విజయభాస్కర్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఇచ్ఛాపురం : ప్రభుత్వం అందిస్తున్న అవకాశం సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డిఇ డి.రామకృష్ణ జగనన్న కాలనీ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని బూర్జపాడు జగనన్న కాలనీ లబ్ధిదారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని అన్నారు. కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. బిల్లులు కూడా చెల్లిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు మల్లేశ్వరరావు, ఎఇ దిలీప్, వర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి గురుమూర్తి పాల్గొన్నారు.

బూర్జ : జగనన్న కాలనీలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని అల్లిన సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేష్ అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా గృహ నిర్మాణశాఖ సిబ్బందితో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీలో రోడ్డు సౌకర్యం,

బూర్జ : మాట్లాడుతున్న మహేష్

ఇతర సదుపాయాలు కల్పించలేదని లబ్ధిదారులు వాపోయారు. ఆయనతో పాటు గృహ నిర్మాణశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, గోవిందరావు ఉన్నారు.

కోటబొమ్మాళి: జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమాం అన్నారు. మండలంలోని దంత పంచాయతీలో ఉన్న జగనన్న కాలనీ పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు చాందని, నాయకులు గొండు మురళి, హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పిఆర్ ఎఇ లతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కావ్య పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి- ఆమదాలవలస/సరుబుజ్జిలి

సైబర్ నేరగాళ్లపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని అమృతలింగానగరంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యత శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఫోన్లు చేసి అకౌంటు వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. అలాగే ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్‌డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, అలాగే ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్ ఝాన్సీ, సిఎఫ్ లక్ష్మి, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, అక్షరాస్యత సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి- కంచిలి

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ సరుకులు తమకు సక్రమంగా ఇప్పించేలా చర్యలు తీసుకోవాలంటూ జ.బెల్లుపడ పంచాయతీకి చెందిన లబ్ధిదారులు అధికారులను కోరారు. ఈ మేరకు సర్పంచ్ ఐదం జయరాం ఆధ్వర్యాన లబ్ధిదారులతో కలిసి తహశీల్దార్ హైమావతికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. అడిగితే దురుసుగా మాట్లాడుతుందని ఆరోపించారు. జనవరి

రేషన్ కార్డులను చూపిస్తున్న గ్రామస్తులు

నెలకు సంబంధించి గ్రామంలో వంద మందికిపైగా లబ్ధిదారులకు సరుకులు ఇవ్వలేదని వివరించారు. విచారణ చేపట్టి సక్రమంగా రేషన్ సరుకులు ఇప్పించాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కొత్తూరు : కొత్తూరు ప్రాజెక్టు పరిధిలోని కొత్తూరు, హిరమండలం మండలాల అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసిడిఎస్ పిఒ టి.విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 11 వరకు స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. మండలంలోని మాకవరం అంగన్వాడీ సహాయకులు (ఎస్‌సి), నీలకంఠపురం అంగన్వాడీ సహాయకులు (బిసి-ఇ), హిరమండలం మండలం పాతహిరమండలం-1 అంగన్వాడీ సహాయకులు (బిసి-డి)లకు కేటాయించామని తెలిపారు.

మొక్కలు నాటుతున్న శ్రీనివాసరావు

మొక్కలు నాటాలి

లావేరు : మనము-మన గ్రంథాలయంలో భాగంగ లావేరు శాఖాగ్రంథాలయంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆవరణలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులతో మొక్కలన నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, పాఠకులు వారి జన్మదినం సందర్భంగా గ్రంథాలయంలో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

త్వరితగతిన ఈ-క్రాప్

జలుమూరు : మండలంలోని రైతులు రబీలో పండిస్తున్న పంటలకు త్వరితగతిన ఈ-క్రాప్ పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్, ఎఎస్ఒ సుధాకర్ గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు పలు సూచనలు చేశారు. వీరితోపాటు సిఎస్‌డిటి పి.గణేష్ ఉన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ చిరంజీవి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి- కంచిలి

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ముఖ్య కూడళ్ల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని బూరగాం జాతీయ రహదారి కూడలి వద్ద ప్రమాదాల నివారణకు శనివారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న పలువురు ద్విచక్ర వాహనదారులను స్టేషన్‌కు తరలించి, వారికి కౌన్సెలింగ్ చేశారు. హెల్మెట్లు వాడని వారిని సైతం స్టేషన్‌కు రప్పించారు. హెల్మెట్లను తెచ్చేంతవరకూ వాహనాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులందరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని అన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

హెల్పింగ్ సొసైటీ చేయూత

వజ్రపుకొత్తూరు : మండలంలోని నారాయణపేటకు చెందిన జుత్తు రూప భర్త కొన్నాళ్ల కిందట మృతి చెందగా, కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కుమారుడు అకాల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం పూట గడవడమే కష్టంగా మారడంతో కుమార్తె పూజను ఇంటర్ చదివించడం భారంగా మారింది. ఈ తరుణంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ముందుకొచ్చి పూండి సాయి వినీత్ కళాశాలలో రూ.11,000 ఫీజులు చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకుంది. ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులకు సొసైటీ ఆర్థిక సహాయంతో చదివిస్తుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, తిరుపతి, ప్రశాంత్, రాహుల్, షణ్ముఖరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కార్డును అందజేస్తున్న సూర్యనారాయణ

గుర్తింపు కార్డులు తప్పనిసరి

సోంపేట: భవన నిర్మాణ కార్మికులందరూ విధిగా తమ కార్మిక గుర్తింపు కార్డును పొందాలని, లేని పక్షంలో బీమా వర్తించదని సోంపేట సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ అన్నారు. సోంపేట కార్యాలయంలో పట్టణానికి చెందిన డి.మోహన్‌కు కార్మిక గుర్తింపు కార్డు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయ పరిధిలోని భవన నిర్మాణ కార్మికులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు చేసుకోవాలన్నారు. దీనికోసం తమ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ జిరాక్స్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. గుర్తింపు కార్డులు లేని వారికి ఎటువంటి బీమా వర్తించదని తెలిపారు. అవకాశాన్ని భవన నిర్మాణ కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయిలో ప్రియ ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్ : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బెంగుళూరులోని రవిశంకర్ ఆశ్రమం తరపున ధి వరల్డ్ ఫోరం ఫర్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగం జాతీయ స్థాయిలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 'శివ శ్రీ నృత్య కళా నికేతన్' సభ్యులు కొమ్ము చేతనప్రియ జాతీయ స్థాయి పథమస్థానంలో నిలిచారు. గురుపాదుకా వనంలో నృత్య భూషణ్ అవార్డును ప్రదానం చేశారు.